క్లుప్తంగా

ఎడతెరిపిలేని వర్షం

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలోని ఏజెన్సీ గ్రామాల్లో సోమవారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి రాత్రి 7 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. పలుచోట్ల వాహనదారులు, ప్రయాణీకుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరుస తుపానుల కారణంగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే ప్రస్తుతం కురిసిన వర్షం పంటలకు ఉపయోగపడతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పరిశుభ్రత పాటిద్దాం..



మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని వాటపాగు సర్పంచ్ రాజారావు అన్నారు. పంచాయతీ కేంద్రంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పరిరక్షణపై చైతన్య ర్యాలీ చేపట్టారు. ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈకేవైసీ తప్పనిసరి

పాలకొండ: రైతులు తాము సాగుచేస్తున్న పంటలకు సంబంధించి ఈకేవైసీ చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి వై.వాహిని సూచించారు. పాలకొండ మండలానికి సంబంధించి 16,870 ఎకరాల్లో ఈ-పంట నమోదు, ఈకేవైసీ చేయాల్సి ఉండగా వీఏఏలు పంట నమోదు పూర్తి చేశారని తెలిపారు. 85 శాతం మంది రైతులు ఈకేవైసీ చేసుకున్నారని, మిగిలిన వారు వెంటనే సమీపంలోని ఆర్బీకేలకు వెళ్లి ఈకేవైసీ చేసుకోవాలని కోరారు.

తెట్టంగిలో పారిశుద్ధ్య పనులు



జేసీబీతో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న దృశ్యం

వీరఘట్టం: మండలంలో తెట్టంగిలో సోమవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ అలజంగి విజయమ్మ ఆధ్వర్యంలో నీలానగరం రోడ్డులో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను జేసీబీతో తొలగించారు. అలాగే వీధికాలువల్లో మురుగును తొలగించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలో కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కోటదుర్గమ్మ ఆలయ కళ్యాణ మండపం ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 96 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు, గంటా సంతోష్, గండిరామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు సోమవారం పరామర్శించారు. అధైర్య పడవద్దని, పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఏ సాయం కావాలన్న తనను సంప్రదించాలని కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వంశధారలో పెరుగుతున్న వరద

భామిని: వాయుగుండం ప్రభావంతో ఒడిశా ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా వంశధార నదికి వరద పోటెత్తింది. నదిలో నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, స్నానాలకు నదిలో దిగవద్దని అధికారులు సూచిస్తున్నారు.

వెలవెలబోతున్న పీహెచ్‌సీలు

- పల్లెల్లో ఆగిన వైద్యసేవలు
- జీవో 85 రద్దు కోరుతూ విధులు బహిష్కరించిన వైద్యులు
- జిల్లాలో 76 మంది వైద్యులు లేక రోగుల ఇక్కట్లు
- ఆస్పత్రులకు వచ్చి తిరిగి వెళ్తున్న అభాగ్యులు
- సీజనల్ వ్యాధులతో పాటు విజృంభిస్తున్న విషజ్వరాలు
- దోచుకుంటున్న ప్రైవేట్ వైద్యశాలలు



వీరఘట్టం పీహెచ్‌సీ

పార్వతీపురం టౌన్: వైద్యులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం ఇబ్బందులు తెచ్చి పెట్టే జీఓలు తీసుకొచ్చి వారి సహనానికి పరీక్ష పెడుతోంది. దీంతో పీహెచ్‌సీ వైద్యులు సమ్మెబాట పట్టారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యుల పీజీ సర్వీస్ కోటాను కుదిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 85 రద్దు చేయాలని కోరుతూ ఈనెల 17వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు సేవలు బహిష్కరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయపార్వతికి ఈ మేరకు సమ్మె నోటీస్ అందజేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని పెద్దఎత్తున నినాదాలు చేసి వైద్యులందరూ తమ హక్కులను కాపాడుకోవడమే లక్ష్యంగా కలిసికట్టుగా చేపట్టిన ఆందోళన విజయవంతం చేశారు. దీంతో ఈనెల 18వ తేదీ జీఓ నంబర్ 85 తో పాటు వివిధ డిమాండ్లపై ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుల అసోసియేషన్‌తో ప్రభుత్వం చర్చలు జరిపింది. ఆ చర్చలు పూర్తిస్థాయిలో ఫలితాలు ఇవ్వలేదు. దీంతో గత్యంతరం లేక సమ్మెను కొనసాగిస్తున్నారు. కనీస వేతనాలు, పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్ వంటి ఇతర ముఖ్యమైన సమస్యలపై వైద్యులు ప్రశ్నించినా ప్రభుత్వం స్పందించడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆ ప్రభావం పీహెచ్‌సీలపై పడుతోంది.

ఆస్పత్రులకు వచ్చి వెనక్కి వెళ్తున్న రోగులు

ఆస్పత్రులకు వచ్చిన రోగులు తిరిగి వెళ్తున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది. మండల కేంద్రాల్లో ఎంబీబీఎస్ వైద్యులు ఉండే ప్రైవేట్ ఆస్పత్రులు కూడా ఉండవు. చిన్న చిన్న రోగాలకు ఆర్ఎంపీలను సంప్రదించినా తీవ్రమైన రోగాలు ఉన్న పేదవారు డబ్బు ఖర్చు చేసి ఎటువెళ్లాలో తెలియక నానా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఏదో ఒక రోగంతో ఒక్కో పీహెచ్‌సీకి సుమారు 80 నుంచి 100 ఓపీ వస్తుంటుంది. పీహెచ్‌సీల్లో వైద్యులు లేక రోగులు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చి తిరిగి వెళ్తున్నారు, దీంతో వైద్యులు లేక ఆస్పత్రులు వెలవెల బోతున్నాయి. సిబ్బంది ఉన్నా డాక్టర్ మందులు రిఫర్ చేస్తేనే వైద్యం చేసేందుకు వీలవుతుంది. దీంతో పేదలు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి డబ్బు ఖర్చు చేసి వైద్యం చేయించుకోలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.



వీరఘట్టం పీహెచ్‌సీలో వైద్యుడులేక ఖాళీ కుర్చీ



డొకిశీల పీహెచ్‌సీలో రోగులు లేక ఖాళీగా ఉన్న బెడ్‌లు



పార్వతీపురం డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

గత్యంతరం లేకనే సమ్మెబాట



నిజానికి మేం ఎప్పుడో సమ్మె చేయాలనుకున్నాం. సరిగా అప్పుడే రాష్ట్రంలో వరదలు వచ్చాయి. కోవిడ్‌లో ప్రాణాలకు తెగించి వైద్యసేవలు అందించిన మేము ఇలాంటి పరిస్థితిలో సమ్మె చేయడం భావ్యం కాదని వాయిదా వేసుకున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నాం. ఇన్ సర్వీస్ కోటా 30 శాతం కొనసాగించాలి.

– డాక్టర్ వినోద్ కుమార్, పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి, పార్వతీపురం మన్యం

37 పీహెచ్‌సీల్లో ఆగిన వైద్యసేవలు

జిల్లాలో మొత్తం 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఇద్దరేసి వైద్యులను గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. వారితో పాటు ఇతర వైద్యులు కలిపి 76 మంది విధులు నిర్వహిస్తున్నారు. మారుమూల పాలుట్ల అటవీ ప్రాంతంలో కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్నారంటే ప్రజల ప్రాణాలకు ఎంతగా ప్రాధాన్యం ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలోని 37 ప్రాథమిక వైద్యశాలల్లో రోజుకు కనీసం 7 వేల నుంచి 10 వేల మంది వరకు వైద్య చికిత్సలు పొందుతున్నారు. వారంతా సామాన్య నిరుపేదలు, మధ్య తరగతికి చెందిన రైతులు, రైతు కూలీలే. ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి వేలకు రూ.వేలు ఖర్చుచేసే స్థోమత లేనివారే. ఇప్పుడు వీరి పరిస్థితి ఏమిటి? వైద్యం కోసం ఎక్కడికి వెళ్లాలని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

జీఓ 85ను తక్షణమే రద్దు చేయాలి



పీజీ వైద్య విద్యలో ఇన్సర్వీస్ కోటాను కుదిస్తూ జారీ చేసిన జీఓ 85ను తక్షణమే రద్దు చేయాలి. గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే వైద్యులకు అలవెన్సు ఇవ్వాలి. జీఓ 85 రద్దుపై స్పష్టత వచ్చే వరకూ నిరసనలు తెలుపుతాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సేవలను ప్రభుత్వం గుర్తించాలి. మా న్యాయ పరమైన డిమాండ్‌లు పరిష్కరించాలి.

– డా. జి. హరికృష్ణ, పీహెచ్‌సీ వైద్యులు, మక్కువ

ఇన్ సర్వీస్ కోటా 30 శాతం కొనసాగించాలి



ఇన్ సర్వీస్ కోటా 30 శాతం కొనసాగించాలి. కనీస వేతనాలు, పదోన్నతులు, ట్రైబల్ అలవెన్స్ వంటి ఇతర ముఖ్యమైన సమస్యలు పరిష్కరించాలి. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితులలో మేము చేసిన సేవలు ప్రభుత్వం గుర్తించక పోవడం అన్యాయం. ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరిస్తుందని భావిస్తున్నాం.

– డా. ప్రదీప్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యులు, వీరఘట్టాం

దోచుకుంటున్న ప్రైవేటు వైద్యశాలలు

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీల రేట్లు ఎక్కువగా ఉన్నాయి. అవసరాన్ని బట్టి వైద్యాన్ని వ్యాపారంగా మార్చి వసూలు చేసే వైద్యశాలలకు పేదలు వెళ్లాలంటే తమ స్థోమతకు మించిన పనే. ప్రైవేట్ వైద్య శాలల్లో మందులకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. కూలీనాలీ చేసుకునే పేదలు ఆ డబ్బు చెల్లించలేక ప్రభుత్వ వైద్యం అందించే వారు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

పెసా ఎన్నికలు వాయిదా

సీతంపేట: షెడ్యూల్డ్ ఏజెన్సీలో మంగళవారం నుంచి నిర్వహించాల్సిన పెసా (పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియా) ఎన్నికలు వాయిదా పడినట్టు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తదుపరి తేదీలను ప్రకటిస్తామన్నారు.

వైద్య శిబిరం



వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్య రక్షణపై దృష్టి పెట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టంకాల దుర్గారావు అన్నారు. కోటదుర్గమ్మ దేవస్థానం ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి వైద్యులు రౌతు భారతి, సుధీర్‌కుమార్, తదితరులు శిబిరంలో వైద్య సేవలందించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వీడీవీకేలను బలోపేతం చేయాలి



సూచనలు చేస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: వన్‌ధన్ వికాస కేంద్రాల(వీడీవీకే)ను బలోపేతం చేయాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. వెలుగు సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. వన్‌ధన్ వికాస కేంద్రాల ఉత్పత్తుల మార్కెటింగ్‌కు సంబంధించిన చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ రకాల ఉత్పత్తుల విక్రయాలపై లక్ష్యాలు నిర్దేశించి వాటిని అధిగమించేందుకు కృషిచేయాలని సూచించాఱు. గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ఏపీడీ సన్యాసిరావు, డీపీఎం రమణ, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ అభినందన



టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి: మండలంలోని సీతమాంబాపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల బోధనాతీరును చూసి, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సిబ్బందిని అభినందించారు. సోమవారం ఆ పాఠశాలను సందర్శించిన ఆయన పాఠ్యాంశాల బోధనకు టి.వనజాక్షి అనే ఉపాధ్యాయురాలు వినియోగిస్తున్న టీఎల్ఎం(టీచింగ్ లెర్నింగ్ మెటీరియ్), కృత్యాలు పరిశీలించారు. కృత్యాబోధనతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని, పలువురు ఆదర్శంగా తీసుకునేలా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో జి.పగడాలమ్మ, తదితరులు ఉన్నారు.

ఈ రోడ్డులో ప్రయాణం ప్రాణసంకటం



భామిని: సింగిడి వద్ద నీటి గుంతలా కనిపిస్తున్న ఏబీరోడ్డు



వీరఘట్టం: వండవ-నవగాం మధ్య అధ్వానంగా తయారైన సీఎస్‌పీ రోడ్డు

వీరఘట్టం: ఒకప్పుడు ఎంతో విశాలంగా, చదునుగా ఉండే వీరఘట్టం-పాలకొండ సీఎస్‌పీ రోడ్డు ప్రస్తుతం గుంతలతో నిండిపోయింది. ఆ గుంతల్లో వర్షపునీరు చేరడంతో వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వండవ-నవగాం, నవగాం-తలవరం, వీరఘట్టం-తూడి మధ్యలో రోడ్డు అధ్వానంగా మారింది. నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మత్తులు జరిపించాలని వాహనదారులు కోరుతున్నారు.

- భామిని: మండలంలో ఏబీ రోడ్డులో ప్రయాణం వాహన చోదకులకు ప్రాణసంకటంగా మారింది. ఈ రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతుండంతో ప్రయాణికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పాలకొండ రూరల్: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై కె.ప్రయోగమూర్తి అన్నారు. పాలకొండ-విశాఖ రహదారిలో సోమవారం ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. అధికలోడుతో వెళ్తున్న వాహనాలపై, డ్రైవింగ్ లైసెన్సు లేనివారిపై, సరైన వాహన ధ్రువపత్రాలు లేని వారిపై, మితిమీరిన వేగంతో ప్రయాణించే వాహన చోదకులపై అపరాధ రుసుం విధించారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇస్తే చట్టరీత్యా వాహన యజమానిపై కూడా కేసులు నమోదు చేస్తామని వివరించారు. రహదారి ప్రమాదాలు నిలువరించేందుకు రోడ్డుభద్రత నిబంధనలు పాటించటమే చక్కటి మార్గమన్నారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

- ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వాకాడ ఇందిర

పార్వతీపురంటౌన్: ప్రజలకు మేలు చేస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారించేందుకు సిద్ధమయ్యారంటూ మహిళా సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు వాకాడ ఇందిర మాట్లాడారు. నూతన మద్యం పాలసీ ద్వారా రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలకు తెరలేపడం దుర్మార్గపు చర్య అంటూ మండిపడ్డారు. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బెల్టుషాపుల రద్దుకు మహిళా సంఘాలు పెద్ద ఎత్తున పోరాటం చేశాయని గుర్తు చేశారు. నాణ్యమైన మద్యం తక్కువ ధరకు సరఫరా చేస్తామంటూ టెండర్లకు శ్రీకారం చుట్టడం దారుణమన్నారు. మాదక ద్రవ్యాలు నిర్మూలించాలంటే మద్యపానం పెంచాలని మంత్రులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ మద్యం పాలసీని ఆదర్శంగా తీసుకోవడం సరికాదని, మద్యపాన నిషేధానికి బీహార్, తమిళనాడు, కేరళ ప్రయత్నాలు చేస్తున్నాయని, ఆ రాష్ట్రాల్లో పర్యటించిన రాష్ట్ర మంత్రివర్గ కమిటీ అక్కడి మద్యం పాలసీపై ఇచ్చిన నివేదిక బహిర్గతం చేయకుండా తొక్కిపెట్టారని ఆరోపించారు. దీన్ని బట్టి చూస్తే ప్రజల శ్రేయస్సును ప్రభుత్వం విస్మరిస్తోందనే విషయం స్పష్టమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చి ప్రజల మానప్రాణాలతో ఆటలాడాలని చూస్తోందని మండిపడ్డారు.

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు బదిలీ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ను ఏపీ సెక్రటేరియట్ కు బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం మున్సి పాలిటీలో ఎన్నికల నిర్వహణలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన స్థానంలో పార్వతీ పురం మున్సిపల్ కమిషనర్‌గా సీహెచ్ శాంతకుమారిని నియమించారు. ఇప్పటివరకు ఆమె శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించారు.

ప్రజలు మెచ్చేలా పోలీసు సేవలు

- డీఎస్పీ ఎం.రాంబాబు



మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ: ప్రజలు మెచ్చేల పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తామని డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. పాలకొండ డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో సర్వీసు చేయడం మంచి అవకాశంగా భావిస్తున్నట్లు చెప్పారు. గతంలో సీఐగా ఇక్కడ పనిచేయడం ద్వారా స్థానిక పరిస్థితులపై అవగాహన ఉందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులకు కచ్చితంగా న్యాయం జరిగేలా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. సిబ్బంది తప్పు చేస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఖైదీల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం



ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్న వైద్యాధికారులు

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు స్థానిక సబ్ జైల్ సూపరింటెండెంట్ బి.జోగులు అన్నారు. లాపరా ప్రాజెక్టు ఆధ్వర్యంలో సబ్ జైల్‌లో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జైలు సిబ్బంది, రిమాండ్ ఖైదీలకు టీబీ, బీపీ, సుగర్, నేత్ర, దీర్ఘకాల ఆరోగ్య సమస్యలకు సబంధించిన వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్లు మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌వార్డర్ పి.చంద్రరావు, పి.మధు, హేయసుంధర్, ఏరియా ఆస్పత్రి సిబ్బంది గోవిందరావు, శ్రీహరినాయుడు, ప్రసాదరావు తదితరులున్నారు.

విత్తనాల పంపిణీ



మినుముల విత్తనాల ప్యాకెట్లతో రైతులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో రైతులకు మినుముల విత్తనాలు సోమవారం పంపిణీ చేశారు. కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ధ్రువ మాట్లాడుతూ మార్కెట్‌లో అపరాలకు మంచి డిమాండ్ ఉందని, రైతులంతా అపరాల సాగు చేపట్టి లాభాలు పొందాలని ఆకాంక్షించారు. అపరాల సాగును ప్రోత్సహించడంలో భాగంగా గుంటూరు లాం ఫారంలో అభివృద్ధిపరిచిన ఎల్‌బీజీ 884, ఎల్‌బీజీ 904 రకాల విత్తనాలను ప్రస్తుతం అందించడం జరిగిందన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని తోలుఖర్జ, వంజరాపుగూడ గ్రామాల్లోని రైతులతో పాటు గరుగుబిల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామ రైతులకు విత్తనాలను ఉచితంగా అందించామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్.స్రవంతి, ఎం.అనంత విహారి, జి.అమృత వీణ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



ఆడలి వ్యూపాయింట్‌ను పరిశీలిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: ఈనెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆడలి వ్యూపాయింట్‌ను సోమవారం ఆయన సందర్శించారు. పర్యాటక దినోత్సవం రోజున ఆడలి వ్యూపాయింట్‌ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా అడ్వంచర్ పార్కులో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏపీవో చిన్నబాబు, ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, డీడీ అన్నదొర, తదితరులు ఉన్నారు.

నేడు కిల్లాడలో 'పొలం పిలుస్తోంది'

సీతంపేట: మండలంలోని కిల్లాడ గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించనున్నట్టు వ్యవసాయాధికారి శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఎన్.జయకృష్ణ పాల్గొంటారని తెలిపారు. రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పట్టుబడిన నాటుసారా ధ్వంసం



వివరాలు తెలియజేస్తున్న ఎస్డీపీఓ రాంబాబు

జియ్యమ్మవలస: ఇటీవల ఎక్సైజ్ కేసుల్లో చినమేరంగి, జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పట్టుబడిన సారా,మద్యం బాటిల్స్‌ను పాలకొండ సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి ఎం.రాంబాబు పర్యవేక్షణలో సోమవారం ధ్వంసం చేసినట్లు ఎస్సై పి.అనీష్ తెలిపారు. ఈ సందర్భంగా 728 లీటర్ల సారా, 683 మద్యం బాటిల్స్‌ను ట్రాక్టర్‌తో చినమేరంగి గ్రామ శివారుకు తీసుకువెళ్లి ధ్వంసం చేసినట్లు ఆయన చెప్పారు.

మద్యం అక్రమంగా అమ్మిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సారా తయారు చేసినా, అమ్మినా సమాచారం ఇస్తే వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని పాలకొండ సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో జియ్యమ్మవలస, చినమేరంగి పోలీస్‌సిబ్బంది ఉన్నారు.